రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

కొత్తగూడ, డిసెంబర్ 20: రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలైన ఘటన మండలంలోని గాదె వాగు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన మద్యల నాగమణి తన భర్త కనకరాజుతో కలిసి బైక్‌పై వరంగల్ నుంచి పాల్వంచకు కొత్తగూడ మీదుగా వెళ్తున్నారు. కొత్తగూడ మండలంలోని గాదె వాగు సమీపంలో నర్సంపేట – కొత్తగూడ ప్రధాన రహదారిపై ఒక్కసారిగా కోతి అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి కిందపడిపోయింది. దీంతో నాగమణికి తీవ్రగాయాలు కాగా వెంటనే 108లో నర్సంపేట దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం దవాఖానకు రెఫర్ చేశారు.

గంజాయి పట్టివేత

పట్టుబడిన గంజాయి, వ్యక్తితో పోలీసులు

పాల్వంచ, డిసెంబర 20: పాల్వంచ జీసీసీ గోడౌన్ వద్ద స్కూటీపై ఓ వ్యక్తి గంజాయి తరలిస్తుండగా పట్టణ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. 6.7 కేజీల గంజాయి స్వాధీనపర్చుకున్నారు. ఇతడిని జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొడవటంచ గ్రామానికి చెందిన ముద్దమల్ల శేషుగా గుర్తించారు. గంజాయిని ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నట్లు విచారణలో అతడు బయటపెట్టాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే రూ.25 వేలు జరిమాన

వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై మేడా ప్రసాద్

మణుగూరు టౌన్, డిసెంబర్ 20: మైనర్లు వాహనం పడుపుతూ పట్టుబడితే ఏకంగా రూ.25 వేలు జరిమానా విధించడంతో పాటు 25 ఏళ్లు వయస్సు వచ్చే వరకు లైసెన్సులు పొందే అవకాశం లేకుండా ఆంక్షలు విధించనున్నామని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలతో పాటు నూతన రహదారి భద్రత నిబంధనలు కూడా ఈ నెలలో అమలులోకి వచ్చాయన్నారు. రెడ్‌లైట్ ఉల్లంఘిస్తే రూ.500, అథారిటీ ఆదేశాలను దిక్కరిస్తే రూ.2 వేలు, లైసెన్సు లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.5 వేలు, అతివేగంగా వాహనాలు నడిపితే రూ.రూ.వెయ్యి జరిమానా, ప్రమాదకరమైన డ్రైవింగ్ చేస్తే రూ.5 వేలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కింద రూ.10వేలు, రేసింగ్, స్పీడింగ్ చేస్తే రూ.5 వేలు, హెల్మెట్ ధరించకపోతే రూ.వెయ్యి, మూడు నెలలు లైసెన్సు రద్దు, సీటు బెల్టు ధరించకపోతే రూ. వెయ్యి, అంబులెన్స్, ఫైర్ వాహనాలను అడ్డుకుంటే రూ. 10 వేలు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు.

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి

దమ్మపేట, డిసెంబర్ 20: మండలంలోని గట్టుగూడెం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు(హెచ్‌ఎం) ఫణికుమార్ రెడ్డి గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన ఈ ఏడాది జూన్‌లో బదిలీపై గట్టుగూడెం వచ్చారు. ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పాఠశాలలో ఉన్నప్పుడే అస్వస్థులయ్యారని, సత్తుపల్లిలోని ఇంటికి వెళ్లగానే కుప్పకూలిపోయారని కుటుంబీకులు తెలిపారు. మృతదేహాన్ని యూటీఎఫ్ నాయకులు బి.రాజు, ఎం.వెంకటేశ్వర్లు, ఆర్.రమేష్ కుమార్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఔషధ మొక్కలు పంపిణీ

టేకులపల్లి, డిసెంబర్ 20: క్యాన్సర్, షుగర్ నివారణకు ఉపయోగపడే ఔషధ మొక్క(బెటర్ లీఫ్)లను హృదయం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు సంజీవరెడ్డి శుక్రవారం బోడు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్‌కు, ఏఎస్సై బీల్యానాయక్‌కు, సిబ్బందికి పంపిణీ చేశారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ అంతరాయం

చుంచుపల్లి, డిసెంబర్ 20: చుంచుపల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏఈ జి.లక్ష్మీనరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యానగర్ కాలనీ, రామాంజనేయ కాలనీ, గాంధీకాలనీ, వెంకటేశ్వర కాలనీ, సారయ్య కాలనీ, రాంనగర్, శేషగిరి నగర్, బస్టాండ్ ఏరియా, పోస్టాఫీస్ ఏరియా, రామా టాకీస్, బర్మా క్యాంప్, డబ్ల్యూబీ గొల్లగూడెం ప్రాంతాల్లో సరఫరా ఉండదని వివరించారు.

కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఆళ్ళపల్లి, డిసెంబర్ 20: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బానోత్ బోజ్యా, ఈసం ముత్తయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఐదు సంవత్సరాలుగా రెన్యూవల్ కానీ బాషా పండితుల కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను వెంటనే రెన్యువల్ చేయాలన్నారు.

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 20: జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలో జరిగే ఆలిండియా యూనివర్సిటీ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి వినయ్, జంపన్న ఎంపికయ్యారు. ఈ నెల 14న వరంగల్‌లో జరిగిన రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో ఫ్రీ స్టైల్ 85 కేజీల విభాగంలో వినయ్, 72 కేజీల విభాగంలో జంపన్న ప్రతిభ చాటి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

వైద్యాధికారి పోస్టుల భర్తీకి దరఖాస్తులు

భద్రాచలం, డిసెంబర్ 20: వైద్య, ఆరోగ్య విభాగం జాతీయ ఆరోగ్య మిషన్‌లో ఆళ్లపల్లి, దమ్మపేట మాతాశిశు ఆరోగ్య, ఎపిడమిక్ బృందంలో వైద్యాధికారి ఖాళీలను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. ఈ నెల 20 నుంచి 27 లోపు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

క్రిస్మస్, నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలతో...
నేటి తరానికి అవసరమైన నిజమైన స్కూల్
న్యూ ఆక్స్‌ఫర్డ్
TO FULFILL YOUR ZEAL
NEW OXFORD CONCEPT SCHOOL ANNAPUREDDYPALLY
శ్రీ బాలాజి వెంకటేశ్వరస్వామి వారి గుడి దగ్గర, అన్నపురెడ్డిపల్లి.
సెల్: 7659963567, 7989260457, 7659968767

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

కేటీఆర్‌పై అక్రమ కేసును ఖండిస్తున్నాం..

ఇల్లెందు : మాట్లాడుతున్న దిండిగల రాజేందర్

పినపాక : మాట్లాడుతున్న మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పినపాక (కరకగూడెం), డిసెంబర్ 20: రాజకీయంగా బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే దమ్ములేక కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ కుటుంబమే లక్ష్యంగా చేసుకుని ఫార్ములా–ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో రేవంత్‌రెడ్డి సర్కార్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించిందని బీఆర్ఎస్ పినపాక మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి అన్నారు. ఆదివారం ఏడూళ్లబయ్యారం క్రాస్ రోడ్‌లో శుక్రవారం జరిగిన నిరసనలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన కేటీఆర్‌పై గౌరవం ఉండాల్సింది పోయి, కేటీఆర్ ప్రభుత్వంపై చేస్తున్న పోరాటాన్ని తట్టుకోలేక అక్రమ కేసు పెట్టి ప్రశ్నించే గొంతును నొక్కేయాలని చూస్తున్నారని అన్నారు. నాయకులు కోలేటి భవానిశంకర్, పొనుగోటి భద్రయ్య, గుమ్మడి గాంధీ, దాట్ల వాసుబాబు, బుల్లిబాబు, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, కొండేరు రాము, పొలిశెట్టి సత్తిబాబు, దొడ్డా శ్రీనివాస్‌రెడ్డి, బత్తుల వెంకటరెడ్డి, రాయల బాబు, కటకం గణేష్, బెల్లంకొండ చిన్నారి, వడ్లకొండ శ్రీను, ముక్కు నాసర్‌రెడ్డి, షేక్ జహంగీర్, గాండ్ల అశోక్ పాల్గొన్నారు.

ఇల్లెందు, డిసెంబర్ 20: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసును ఆ పార్టీ సీనియర్ నాయకుడు దిండిగాల రాజేందర్ ఖండించారు. ఆయన శుక్రవారం పార్టీ స్థానిక కార్యాలయంలో పట్టణ, మండల నాయకులతో సమావేశమయ్యారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. సిలివేరి సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, జాఫర్ హుస్సేన్, అజ్మీరా భావ్‌సింగ్, నబీ, జబ్బర్ శివ పాల్గొన్నారు.

దుమ్ముగూడెం, డిసెంబర్ 20: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ అధికారులు అక్రమంగా కేసులు బనాయించారని బీఆర్ఎస్ మండల యువజన విభాగం నాయకులు లంక శివ అన్నారు. హైదరాబాద్ ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ఒక మంత్రిగా తన బాధ్యతను నిర్వర్తిస్తే కాంగ్రెస్ పార్టీ దోషిగా చూపాలని చూస్తోందన్నారు. ప్రజాస్వామ్యవాదులంతా దీనిని ఖండించాలన్నారు.

కేంద్ర హోం మంత్రిగా అమిత్ షా అనర్హుడు

నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఇల్లెందు, డిసెంబర్ 20: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాకు ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సీపీఎం జిల్లా మహాసభలో ఆయన మాట్లాడుతూ.. అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వాలని కోరారు.

భద్రాచలం, డిసెంబర్ 20: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం భద్రాచలంలో సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద నిరసన నిర్వహిచారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ.. తక్షణమే అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సున్నం గంగ, డి.సీతాలక్ష్మి, నాదెళ్ల లీలావతి, ఉస్తెల జ్యోతి, రాఘవయ్య, చాట్ల శ్రీను, జీవన జ్యోతి, అజయ్‌కుమార్, కోరాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొన ఊపిరితో ఉన్న తల్లీబిడ్డలకు
ఊపిరి పోసిన భద్రాద్రి వైద్యులు

చికిత్స పొందుతున్న తల్లి, శిశువుకు వైద్యం అందిస్తున్న వైద్యులు

భద్రాచలం, డిసెంబర్ 20: ప్రసవం కోసం వచ్చి అపస్మారక స్థితిలో కొన ఊపిరితో ఉన్న గర్భిణికి ప్రసవం చేసి వెంటిలేటర్‌పై వైద్య సేవలందించడంతో పాటు స్పృహ లేకుండా పుట్టిన శిశువుకు వైద్యులు శ్రమించి ఊపిరి పోశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. చర్ల మండలం రాళ్లపురం గ్రామానికి చెందిన 39 ఏళ్ల కుంజం మయమ్మ ఈ నెల 11న ప్రసవం కోసం భద్రాచలం ఏరియా వైద్యశాలలో చేరింది. అప్పటికే ఆమె అధిక రక్తపోటుతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వైద్యులు ఆమెకు ప్రసవం నిర్వహించగా ఆమె కోలుకోకపోవడంతో వెంటిలేటర్‌పై ఉంచి వారం రోజుల నుంచి వైద్యం అందించారు. అలాగే పుట్టిన బిడ్డకు సైతం స్పృహ లేకపోవడంతో వైద్యులు మెరుగైన వైద్య సేవలందించడంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. మెరుగైన వైద్య సేవలందించిన ప్రసూతి వైద్యులు డాక్టర్ ప్రమీల, డాక్టర్ సాత్విక, పిల్లల వైద్యులు డాక్టర్ మౌనిక, డాక్టర్ విజయరావు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణను కలెక్టర్, డీసీహెచ్‌వో ప్రత్యేకంగా అభినందించారు.

ఆలయం ముందే వాహనాల పార్కింగ్

ఇబ్బందులు పడుతున్న భక్తులు

ఆలయం ముందు నిలిపిన వాహనాలు

పర్ణశాల, డిసెంబర్ 20: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల ఆలయం ఎదుటే యాత్రికుల వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో చాలా ఇబ్బందిగా మారుతుందని గ్రామస్తులు అంటున్నారు. వాహనాలు నేరుగా రావడంతో ఆలయం ప్రాంగణంలో ఉన్న చెప్పుల పాటదారులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పాట పాడిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కింగ్ స్థలం వద్ద ఆలయం తరపున వాహనాలు ఆలయం ముందుకు రాకుండా ఒక సెక్యూరిటీ గార్డును నియమించడం జరిగింది. కానీ ఇటీవల ఆలయ అధికారులు అక్కడ డ్యూటీ చేస్తున్న సెక్యూరిటీ గార్డుకు ఆలయంలో పనులు కేటాయించడంతో పార్కింగ్ వద్ద ఆగాల్సిన వాహనాలు నేరుగా ఆలయం ముందుకు వస్తున్నాయి. ఆలయ అధికారులు ఇప్పటికైనా స్పందించి పార్కింగ్ స్థలం వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసి నేరుగా వాహనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పుల పాటదారులు కోరుతున్నారు. ఈ సమస్యపై పర్ణశాల ఆలయ అధికారి అనీల్‌కుమార్‌ను వివరణ కోరగా.. పార్కింగ్ వేలం పంచాయతీ వారు నిర్వహిస్తున్నారని, వాహనాలు ఆలయానికి ముందుకు రాకుండా పార్కింగ్ స్థలం వద్ద వాహనాలు నిలుపుదల చేసే బాధ్యత పంచాయతీ శాఖదే అన్నారు.

హత్య కేసులో 15 మందికి జైలు

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 20: హత్య కేసులో 15 మందికి జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఇల్లెందు 24 ఏరియాకు చెందిన పులిపాటి లోకేష్ అలియాస్ సాయికుమార్, తనకు వరుసకు చెల్లె అయిన అమ్మాయిని ప్రేమిస్తున్నాడంటూ అవినాష్ అనే వ్యక్తిని హెచ్చరించాలని అనుకున్నాడు. ఇందు కోసం ఇల్లెందుకు కొందరిని పిలిపించి, విషయం చెప్పి, వారందరినీ అవినాష్ వద్దకు పంపాడు. ఈ వ్యవహారంలో ఇంకొందరు కూడా జత కలిశారు. అక్కడ జరిగిన గొడవలో తీవ్రంగా గాయపడిన దండు శ్రీను అనే వ్యక్తి, 2015 జూన్ 13న ఆస్పత్రిలో మృతిచెందాడు. కేసును అప్పటి ఎస్సై అశోక్ దర్యాప్తు చేశారు. కోర్టులో చార్జిషీటును అప్పటి సీఐలు రమేష్, నరేందర్ దాఖలు చేశారు. 23 మంది సాక్షులను కోర్టు విచారించింది. మొత్తం 15 మంది నిందితులపై నేరం రుజువైనట్లుగా పేర్కొంటూ, వారికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ పీవీడీ లక్ష్మి నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ ప్రవీణ్, లైజన్ ఆఫీసర్ వీరబాబు, ఇల్లెందు పీసీ శ్రీనివాస్ సహకరించారు.

నీతి ఆయోగ్ సీఈవో వీడియో కాన్ఫరెన్స్

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఆకాంక్షిత జిల్లాల కలెక్టర్లతో నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం శుక్రవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జూలై 1 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు జరిగిన సంపూర్ణత అబియాన్ కార్యక్రమాలను సమీక్షించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, సీపీవో సంజీవరావు, యాస్పిరేషన్ బ్లాగ్ ప్రోగ్రాం ఫెలో నవనీత్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు మద్దతుగా విద్యార్థులు

పాల్వంచ రూరల్, డిసెంబర్ 20: సమ్మె చేస్తున్న టీచర్లకు విద్యార్థులు మద్దతుగా నిలిచారు. 'మా టీచర్ల సమస్యలను పరిష్కరించి, వారిని వెంటనే మా పాఠశాలకు పంపండి' అని కోరుతూ, పాల్వంచ ఇందిరాకాలనీ కేజీబీవీ విద్యార్థినులు పాఠశాల వద్ద శుక్రవారం ప్ల కార్డులతో ప్రదర్శన నిర్వహించారు. తమ చదువు సాఫీగా సాగేలా చూడాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

'సింగరేణి డే' క్రీడాపోటీలు

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 20: సింగరేణి డే సందర్భంగా మహిళలకు కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో శుక్రవారం క్రీడాపోటీలను సేవా సమితి బాధ్యులు హరిణీసత్యనారాయణ, సునీతావెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంబించారు. అధికారులు రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాసరావు, వరప్రసాదరావు, ఇజాజ్ షరీఫ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వెల్ బేబీ షో

రామవరం, డిసెంబర్ 20: సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని ఉద్యోగుల పిల్లలతో శుక్రవారం వెల్ బేబీ షో జరిగింది. దీనిని డీజీఎం (పర్సనల్) ప్రారంభించారు. డాక్టర్ పరశురాములు, సీనియర్ పీవో ఎం.మురళి, సేవా కో–ఆర్డినేటర్ సాగర్, సెక్రటరీ అనిత పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

జూలూరుపాడు, డిసెంబర్ 20: మండలంలోని గుండెపుడి గ్రామంలో ఈ నెల 22న ఉచిత చక్ర సిద్ధ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జేకే ఆర్ట్స్ నిర్వాహకుడు కాళ్లూరి జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ సత్య సింధుజ వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. మైగ్రేన్, మెడ నొప్పి, కీళ్ల నొప్పులు, స్పైనల్ ఇంజురీస్, బ్యాక్ పెయిన్, స్పైనల్ డిజార్డర్, హీల్ పెయిన్స్, సయాటికా తదితర వ్యాధులకు చికిత్స ఉంటుందని వివరించారు. బాధితులంతా ఉపయోగించుకోవాలని కోరారు.

ఆదివాసీలకు ధ్రువీకరణ పత్రాలు అందించాలి

బూర్గంపాడు, డిసెంబర్ 20: ఆదివాసీలకు కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలని టీజేఎస్ పార్టీ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి గోపగాని శంకర్రావు అన్నారు. శుక్రవారం బూర్గంపాడు ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీలకు కుల ధ్రువీకరణ ప్రతాలు ఇవ్వాలని గతంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి కూడా దరఖాస్తు రూపంలో కలిసి ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశంలో ఖాదర్ బాబా, ఉన్నం సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ యాప్‌లలో పెట్టుబడులు పెట్టొద్దు

బూర్గంపాడు, డిసెంబర్ 20: ఆన్‌లైన్ యాప్‌లలో పెట్టుబడి పెట్టి మోసపోవద్దని బూర్గంపాడు ఎస్సై రాజేష్ అన్నారు. మండల వ్యాప్తంగా ఇటీవల చాలా మంది పెట్టుబడి పెడుతున్నట్లు తెలిసిందని, ఆ పెట్టుబడి పెట్టే క్రమంలో డబుల్ వస్తుందని అత్యాశ పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎక్కువ డబ్బు ఆశ చూపించి మోసం చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన

చంద్రుగొండ, డిసెంబర్ 20: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ఇంటింటి సర్వేను అదనపు కలెక్టర్ వేణుగోపాల్ శుక్రవారం పరిశీలించారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్, పంచాయతీ సెక్రటరీ శివన్నారాయణ పాల్గొన్నారు.

మున్సిపాలిటీగా అశ్వారావుపేట

అశ్వారావుపేట, డిసెంబర్ 20: మేజర్ పంచాయతీగా ఉన్న అశ్వారావుపేట.. త్వరలోనే మున్సిపాలిటీగా మారనుంది. ఈ విషయాన్ని గురువారం అసెంబ్లీలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాల చెరువు పంచాయతీల విలీనంతో మున్సిపాలిటీ ఏర్పాటవుతుంది. దీనికి సంబంధించిన జీవో విడుదల కావాల్సి ఉంది. ఈ మూడు పంచాయతీల్లోని మొత్తం జనాభా 31,696 ఉంది. వీరిలో దాదాపుగా సగం మంది (16,706) ఓటర్లుఆ ఉన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

టేకులపల్లి, డిసెంబర్ 20: తెలంగాణ ప్రగతిశీల పంచాయతీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) మండల నిర్మాణ సర్వసభ్య సమావేశం ప్రచార కరపత్రాన్ని నాయకుడు కత్తుల ఎర్రయ్య శుక్రవారం మండలంలో వివిధ గ్రామాల్లో ఆవిష్కరించారు. నాయకులు భద్రయ్య, శ్రీను, గణేష్ పాల్గొన్నారు.

బెస్ట్ కోఆర్డినేటర్‌గా 'దారా'

దమ్మపేట, డిసెంబర్ 20: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ బెస్ట్ కోఆర్డినేటర్ గా దారా మల్లికార్జునరావు ఎంపికయ్యారు. తమిళనాడులోని మధురైలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఆయనకు అవార్డును అంతర్జాతీయ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్ అందించారు. మల్లికార్జునరావును స్థానిక వాసవీ క్లబ్ సభ్యులు, ఆర్య వైశ్య సంఘం నాయకులు అభినందించారు.

చేతక్ షోరూం ప్రారంభం

షోరూం ప్రారంభిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

లక్ష్మీదేవిపల్లి, డిసెంబర్ 20: మండలంలోని సాయి అంజనా మోటర్స్ ఏర్పాటు చేసిన చేతక్ షోరూంను శుక్రవారం ఎస్పీ రోహిత్‌రాజు ప్రారంభించారు. షోరూం అధినేత ఆకుల శ్రీనివాస్, కంపెనీ ఏఎస్ఎం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ కవచాలతో దర్శనమిచ్చిన రామయ్య

నిత్యకల్యాణం నిర్వహిస్తున్న వైదిక సిబ్బంది

భద్రాచలం, డిసెంబర్ 20: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారు శుక్రవారం సందర్భంగా భక్తులకు అంతరాలయంలో స్వర్ణ కవచాలతో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, యజ్ఞోపవీతదారణ, కంకణదారణ, జీలకర్రబెల్లం, మాంగల్యదారణ గావించారు. అనంతరం కల్యాణమూర్తులకు వేద ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో వైదిక సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షకు మద్దతు

మద్దతు తెలుపుతున్న హరిప్రియానాయక్

టేకులపల్లి, డిసెంబర్ 20: సమగ్ర శిక్ష ఉద్యోగులు.. సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. దీక్ష శిబిరంలో వీరిని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ శుక్రవారం సందర్శించి మద్దతు తెలిపారు. నాయకులు లక్కినేని సురేందర్‌రావు, బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్, మాలోత్ పూల్ సింగ్, అజ్మీరా రవి, బానోత్ బాలు, మాలోత్ భద్రం తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు

రికార్డులను పరిశీలిస్తున్న డీఏవో బాబురావు

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 20: నకిలీ ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖాధికారి(డీఏవో) బాబురావు హెచ్చరించారు. స్థానిక ఎరువుల దుకాణాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు, డీబీటీ మెషిన్లు, బిల్ బుక్స్‌ను పరిశీలించారు. డీలర్లతో ఆయన మాట్లాడుతూ... నిబంధనల మేరకే ఎరువులను విక్రయించాలన్నారు. డీబీటీ మెషిన్‌లో వివరాలను పొందుపర్చాలన్నారు. ధరల పట్టికలను, నిల్వలను ప్రదర్శించాలని చెప్పారు. ఏడీఏ రవికుమార్, ఏవో అనూష పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ సందర్శన

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చంద్రుగొండ, డిసెంబర్ 20: స్థానిక మార్కెట్ యార్డును అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ శుక్రవారం సదర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, వే బ్రిడ్జిని వాడుకలోకి తెస్తామని రైతులతో చెప్పారు. తహసీల్దార్ సంధ్యారాణి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో తిథి భోజనం

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 20: రామవరం ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు, సిబ్బందితో కలిసి డీఈవో వెంకటేశ్వరాచారి తిథి భోజనం చేశారు. హెచ్ఎం ప్రభుదయాళ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతమే లక్ష్యం

ఇల్లెందు, డిసెంబర్ 20: జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ బలోపేతమే లక్ష్యంగా శ్రేణులు శ్రమించాలని సీపీఎం శ్రేణులకు నాయకులు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా మహాసభలు శుక్రవారం ఇల్లెందులో ప్రారంభమయ్యాయి. ముందుగా, ఏలూరి భవనం నుంచి సింగరేణి కమ్యూనిటీ హాల్ వరకు ప్రదర్శన సాగింది. రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, నాయకులు పోతినేని సుదర్శన్, బి.వెంకట్, మిడియం బాబురావు, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. నాయకులు సోమయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, పిట్టల రవి, బ్రహ్మచారి, నబీ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉపాధ్యాయుల నిరవధిక సమ్మె

భద్రాచలం, డిసెంబర్ 20: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయుల డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం భద్రాచలంలో కాంట్రాక్టు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అజ్మీరా శివనాయక్ మాట్లాడుతూ.. డిమాండ్ల సాధన కోసం తమ సమ్మె కొనసాగిస్తామని పేర్కొన్నారు.

కస్తూర్బా పాఠశాల విద్యార్థినికి శస్త్ర చికిత్స

దుమ్ముగూడెం, డిసెంబర్ 20: దుమ్ముగూడెంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో ఇటీవల కిందపడి చేయి విరిగిన ఏడో తరగతి బాలిక ప్రవళికకు శుక్రవారం భద్రాచలంలోని దేవరాజ్ వైద్యశాలలో శస్త్ర చికిత్స నిర్వహించారు. బాలికను టీపీఎస్సీ ఎస్టీ సెల్ కోఆర్డినేటర్, నాయకులు తెల్లం నరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోడి చంటిదొర పరామర్శించారు. బాలిక తల్లిదండ్రులు ఉబ్బరాజు, సుజాతను వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ

భద్రాచలం, డిసెంబర్ 20: భద్రాచలంలో యశోద ఫౌండేషన్ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లను కారు స్టాండ్ అధ్యక్షుడు భాష్యం వెంకట రమణయ్య, మానవ హక్కుల జిల్లా కార్యదర్శి కిష్ట శ్రీనివాసరావు వాల్మీకి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. రాజా పెరియార్, డాక్టర్ భాను ప్రసాద్, రాజేశ్వరరావు, దాసుబాబు, సత్యనారాయణ, జాన్‌కుమార్, వీర రాఘవులు పాల్గొన్నారు.